క్లుప్తంగా

నేడు వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ ఆంధ్ర ప్రభకాలనీలోని శ్రీషిర్డీసాయిబాబా మందిర ఆవరణలో ఉన్న శ్రీ భూ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం మంగళవారం నిర్వహించనున్నట్లు శ్రీసాయిప్రభ సేవా ట్రస్ట్ అధ్యక్షురాలు బాల త్రిపుర సుందరీదేవి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్వామి వారి సన్నిధిలో సుదర్శన హోమం, విష్ణు సహస్ర నామ పారాయణం, హనుమాన్ చాలీసా పారాయణాలు జరుగుతాయని పేర్కొన్నారు.

ఆరోగ్య కార్యక్రమాల్లో ప్రగతి సాధించండి

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుహాసిని

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఆరోగ్య కార్యక్రమాల నిర్వహణలో ప్రగతి చూపాలని ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.సుహాసిని ఆదేశించారు. నగరంలోని తన కార్యాలయంలో సోమవారం పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆరోగ్య కార్యక్రమాల అమలు, లక్ష్యాల మేరకు ప్రగతి తదితర అంశాలపై చర్చించారు. ఎన్‌సీడీ–సీడీ, మాతా శిశు సంరక్షణ, వ్యాధి నిరోధక టీకాలు కార్యక్రమం, ఇతర ఆరోగ్య కార్యక్రమాల ప్రగతి, లక్ష్యాల సాధనకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ అమృత, సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ నరసింహనాయక్, ఎన్‌సీడీ–సీడీ కార్యక్రమం అధికారి డాక్టర్ మాధవి, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతీబాబు, టీబీ వైద్యాధికారి డాక్టర్ పద్మావతి, డీపీఓ వి.మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆటల్లో రాణించాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు ఆటల్లో కూడా రాణించాలని కళాశాల విద్య కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ పిలుపునిచ్చారు. మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం స్విమ్మింగ్‌లో సత్తాచాటుతున్న కళాశాల విద్యార్థి బోను బాల గంగాధర్ అభినందన కార్యక్రమం జరిగింది. బాలగంగాధర్‌ను సత్కరించారు. ఆయన మాట్లాడుతూ అంతర్‌జిల్లాల ఆక్వాటిక్ చాంపియన్‌షిప్ పోటీల్లో 200 మీటర్ల వ్యక్తిగత మిడ్లే విభాగంలో బంగారు, 100,200 మీటర్స్ బ్యాక్‌స్ట్రోక్ విభాగం, 100 మీటర్ల బటర్‌ఫ్లై విభాగంలో ఒక బంగారు, మూడు రజత పతకాలు సాధించడం కళాశాలకే గర్వకారణమన్నారు. ఇదే స్ఫూర్తితో 79వ జాతీయ అక్వాటిక్ చాంపియన్‌షిప్ పోటీల్లో సత్తాచాటి కళాశాలకు రాష్ట్రానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి, వ్యాయామ విద్య విభాగాధిపతి డాక్టర్ మండవ కోటేశ్వరరావు, డాక్టర్ డి.యుగంధర్, డాక్టర్ అనిల్ కుమార్.. బాలగంగాధర్‌ను అభినందించారు.

ఆకలి, దాహం తీర్చాలి



భవానీపురం(విజయవాడపశ్చిమ): మండు వేసవిలో పాదచారుల ఆకలి, దాహం తీర్చడం పుణ్యప్రదమని, అభినందనీయమని ఆధ్యాత్మికవేత్త, వాసవి క్లబ్స్ అంతర్జాతీయ మాజీ అధ్యక్షుడు వేముల హజరతయ్య గుప్తా అన్నారు. వాసవి క్లబ్ సూపర్ స్టార్ విద్యాధరపురం ఆధ్వర్యాన స్థానిక కుమ్మరిపాలెం సెంటర్‌లో సోమవారం ఏర్పాటు చేసిన పెరుగు ఆవడ, మజ్జిగ, మినరల్ వాటర్ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి స్వచ్ఛంద సంస్థ, దాతలు ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. క్షుద్బాధ, దాహార్తి తీర్చుకున్న వారి హృదయం నుంచి వచ్చే ఆశీస్సులు దాతలకు శ్రేయస్కరమన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు లలితారాణి, అనురాధ, కోశాధికారి లలిత, అంజన, మల్లిక, తులసి, సుందరరావు, విజయలక్ష్మి, ప్రీతి, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

తల్లి అదృశ్యంపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): తల్లి అదృశ్యమైన ఘటనపై కుమారుడి ఫిర్యాదుపై కొత్తపేట పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వైఎస్సార్ కాలనీకి చెందిన అప్పదొర కాశమ్మ, వెంకటేశ్వర్లు దంపతులు. వీరికి ముగ్గురు సంతానం. మొదటి, రెండో కుమారుడికి వివాహాలయ్యాయి. కాశమ్మకు అప్పుడప్పుడు మతిస్థిమితం సరిగా ఉండదు. మూడో కుమారుడు చిన్నదొరతో ఆమె నివసిస్తోంది. గత నెల 25న కాశమ్మ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. పలుచోట్ల వెదికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విద్యా సంస్కరణలు దేశానికే ఆదర్శం

మధురానగర్(విజయవాడసెంట్రల్): జగనన్న ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యాసంస్కరణలు దేశానికే తలమానికమని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. ముత్యాలంపాడులోని గొట్టుముక్కల సూర్యనారాయణరాజు నగరపాలక సంస్థ పాఠశాలలో సోమవారం 500 మంది విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి పెనుమత్స సత్యంతో కలిసి కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యా బోధన అందించడానికి సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అన్ని రకాల చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో విద్యాలయాలు శిథిలావస్థకు చేరాయని, నేడు జగనన్న ప్రభుత్వంలో సకల వసతులతో కళకళలాడుతున్నాయని చెప్పారు. అమ్మఒడి, నాడు–నేడు కింద మౌలిక వసతుల కల్పన, గోరుముద్ద, విద్యాకానుక, ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్ఈ సిలబస్.. ఇలా చిన్నారుల బంగారు భవిష్యత్ కోసం చేయగలిగినంతా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్నారన్నారు. 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేశారన్నారు. కార్యక్రమంలో స్కూలు ప్రధానోపాధ్యాయురాలు జి.పుష్పలత, ఎలిమెంటరీ స్కూల్ ప్రిన్సిపాల్ పరమేష్, బెజ్జం రవికుమార్, మానం వెంకటేశ్వరరావు, గోవింద్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

దుర్గాపురంలో..

దుర్గాపురం ఎస్‌టీవీఆర్ నగరపాలక సంస్థ పాఠశాలలో సోమవారం జగనన్న విద్యాకానుక కిట్లను ఎమ్మెల్యే మల్లాది విష్ణు అందజేశారు. కార్యక్రమంలో స్కూలు ప్రధానోపాధ్యాయురాలు ఎం.సూర్యప్రభ, ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సింగ్‌నగర్‌లో..

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ ఎంకే బేగ్ మునిసిపల్ ఎలిమెంటరీ స్కూల్లో విద్యా కానుక కిట్ల పంపిణీ చేశారు. స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎంఎంఎస్ ఇమామ్‌బాషా మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులను ఆదుకునేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు.



ముత్యాలంపాడులో జేవీకే కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

62,64 డివిజన్లలో..

పాయకాపురం(విజయవాడసెంట్రల్): స్థానిక 62వ డివిజన్‌లోని పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ హైస్కూల్, ఎలిమెంటరీ పాఠశాలల్లో సోమవారం 'జగనన్న విద్యా కానుక' కిట్లను పంపిణీ చేశారు. పాఠశాలల హెచ్‌ఎంలు మోహన్, మురళీకృష్ణ, వైఎస్సార్‌సీపీ నగర ప్రధాన కార్యదర్శి అలంపూరు విజయ్‌కుమార్, వీరబాబు, బుజ్జి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

● స్థానిక 64వ డివిజన్‌లోని బీవీ సుబ్బారెడ్డి మున్సిపల్ హైస్కూల్, ఎలిమెంటరీ స్కూల్స్‌లో జగనన్న విద్యా కానుక కిట్లను కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

● రూరల్ మండలం జక్కంపూడి వైఎస్సార్‌కాలనీలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, పైడూరుపాడు గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాలల్లో సోమవారం 'జగనన్న విద్యాకానుక' కిట్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. స్థానిక ఎంపీటీసీ బయ్యారపు కల్పన, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు బయ్యారపు కిషోర్ విద్యార్థులకు కిట్లను అందజేశారు. కార్యక్రమంలో పైడూరుపాడు సర్పంచ్ సీతారామయ్య, జక్కంపూడి హైస్కూల్ హెచ్‌ఎం కె.పద్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యతో ఉజ్వల భవిష్యత్తు..

● విద్యతో ఉజ్వల భవిష్యత్తు సొంతమవుతుందని వైఎస్సార్ సీపీ 8వ డివిజన్ ఇన్‌చార్జి యలమంచిలి జయప్రకాష్ చెప్పారు. స్థానిక జమ్మిచెట్టు సెంటర్‌లోని బోయపాటి శివరామకృష్ణయ్య (బీఎస్ఆర్‌కే) మున్సిపల్ స్కూల్ ఆవరణలో సోమవారం జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ జరిగింది.



విద్యాకానుక కిట్లను పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం ఇమామ్‌బాషా, ఉపాధ్యాయులు



కిట్లను పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు



జగనన్న విద్యా కానుక కిట్లను అందుకున్న విద్యార్థులు

ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సౌకర్యాలు వినియోగించుకుని ఉన్నతస్థానాలకు చేరుకోవాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.నాగరాజు, ఆంధ్ర మోటారు మర్చంట్స్ అసోసియేషన్ (అమ్మ) మాజీ అధ్యక్షుడు యార్లగడ్డ సుబ్బారావు, బీఎస్ఆర్‌కే హైస్కూల్ పేరంట్స్ కమిటీ చైర్‌పర్సన్ రేఖారాణి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గడువులో స్పందన అర్జీలు పరిష్కరించండి

మేయర్ భాగ్యలక్ష్మి

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్పందనలో వచ్చిన అర్జీలను నిర్దేశిత గడువులో పరిష్కరించాలని మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో వారు అధికారులతో కలిసి సోమవారం నిర్వహించిన స్పందనలో నగరవాసుల నుంచి అర్జీలు తీసుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ అర్జీదారుని సమస్యను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. ప్రజలకు ప్రభుత్వం, వీఎంసీ కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, పథకాలు సకాలంలో అందుతున్నాయా లేదా అనేది నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

స్పందనలో వచ్చిన అర్జీలు 11

స్పందనలో వివిధ సమస్యలపై మొత్తం 11 అర్జీలు రాగా వాటిల్లో ప్రధానంగా తాగునీటి సరఫరా, డ్రెయినేజి కాలువల సమస్యలు తమ దృష్టికి వచ్చాయని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించామని తెలిపారు. ఇంజినీరింగ్ విభాగం – 2, పట్టణ ప్రణాళిక విభాగం – 4, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యూసీడీ) – 3, పబ్లిక్ హెల్త్ విభాగం – 1, రెవెన్యూ –1 ఉన్నాయని వివరించారు. సమావేశంలో అదనపు కమిషనర్ (జనరల్) ఎం.శ్యామల, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రత్నావళి, సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) డి.వెంకటలక్ష్మి, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యూసీడీ) శకుంతల, జాయింట్ డైరెక్టర్ (అమృత్) డాక్టర్ కేబీఎస్ఎస్ లత, ఏడీహెచ్ శ్రీనివాసు, బయాలజిస్ట్ సూర్య నాయక్, మేనేజర్ బీ శ్రీనివాసరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.



స్పందనలో మేయర్ భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

సర్కిల్ కార్యాలయాల స్పందనలో 2 అర్జీలు

నగరంలోని మూడు నియోజకవర్గాల్లోని మూడు సర్కిల్ కార్యాలయాల్లో నిర్వహించిన స్పందనలో ఆయా ప్రాంతాల ప్రజల నుంచి మొత్తం 2 అర్జీలు స్వీకరించారు. సర్కిల్–2 కార్యాలయంలో పట్టణ ప్రణాళిక విభాగం – 1, రెవెన్యూ – 1 అర్జీలు రాగా సర్కిల్ – 1, 3 నుంచి ఎటువంటి అర్జీలు రాలేదని ఆయా కార్యాలయాల జోనల్ కమిషనర్లు తెలిపారు.

తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించండి

వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

భవానీపురం(విజయవాడపశ్చిమ): పారిశుద్ధ్య సిబ్బంది ప్రతి ఇంటి వద్ద తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రజారోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. నగరంలోని 10, 11 వార్డుల్లో పటమట కూడలి, పంటకాలువ రోడ్, కరణంగారి బజార్, కాకతీయ రోడ్, ఫన్‌టైమ్ రోడ్డులో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను ఆయన అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఆ ప్రాంతాల్లో ఇళ్ల వద్దకు వెళ్లి చెత్త వాహనాలు ఎన్ని గంటలకు వస్తున్నాయి, వీధులను తరచూ శుభ్రం చేస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ నగరంలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. నగర పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలని కోరారు. తరచూ కాలువల్లో పూడిక తీతలు, పిచ్చి మొక్కల తొలగింపు, బ్లీచింగ్ చల్లించటం, ఫాగింగ్ తదితర పనులు ముమ్మరంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. అలాగే నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి వేగంగా పూర్తి చేయాలని, వానా కాలం దృష్ట్యా పూడికలు తీయాలని అధికారులను ఆదేశించారు.



పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

బాల కార్మిక వ్యవస్థ రూపుమాపడానికి కృషి

గుణదల (విజయవాడ తూర్పు): బాల కార్మిక వ్యవస్థను రూపుమాపడానికి కృషి చేయాలని ఎన్టీఆర్ జిల్లా బాలల సంక్షేమ కమిటీ మెంబర్ వై.భార్గవ్‌రామ్ అన్నారు. ఆంధ్ర లయోల కళాశాల పీజీ సెమినార్ హాల్లో సోమవారం ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినం కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. చిన్న పిల్లలతో వెట్టి చాకిరీ చేయించడం చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. బాల కార్మిక వ్యవస్థను ప్రోత్సహించడం భవిష్యత్ కు గొడ్డలి పెట్టని అభిప్రాయపడ్డారు. ఆర్థిక ఇబ్బందులు తాళలేక పేద కుటుంబాలకు చెందిన చిన్నారులే బాల కార్మికులుగా మారుతున్నారని చెప్పారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. అనంతరం బాల కార్మిక వ్యవస్థ – నిర్మూలన అనే అంశంపై ప్రసంగించారు. ఆంధ్ర లయోల కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ డాక్టర్ జి.కిరణ్, నవజీవన్ బాల భవన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫాదర్ రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

అన్నిదానాల్లో అన్నదానం మిన్న

మధురానగర్(విజయవాడసెంట్రల్): అన్నిదానాల్లో అన్నదానం మిన్న అని ఆకలితో ఉన్నవారి కడుపు నింపటంలో ఉన్న తృప్తి మరెందులోను ఉండదని ముళ్లపూడి కృష్ణమోహనరావు అన్నారు. ముత్యాలంపాడులో సోమవారం హెల్పింగ్ టుగెదర్ 2009 గ్రూప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన అన్నదానం జరిగింది. సుమారు 200 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు షఫీవుల్లా, మల్లిక, రహీమా, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.



భోజనాలు వడ్డిస్తున్న హెల్పింగ్ టుగెదర్ ట్రస్ట్ సభ్యులు

సంక్షేమం, అభివృద్ధికి కేరాఫ్ జగన్ పాలన

సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): సంక్షేమం, అభివృద్ధికి చిరునామాగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన నిలుస్తోందని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా స్థానిక కార్పొరేటర్ శర్వాణీ మూర్తితో కలిసి ఎమ్మెల్యే విష్ణు సోమవారం 33వ డివిజన్ 216వ వార్డు సచివాలయ పరిధిలోని పలు ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ వెళ్లారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలవుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. తొలుత వంగవీటి మోహనరంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి పర్యటన ప్రారంభించారు. పురుషోత్తంవారి వీధి, మంగళంపల్లివారి వీధి, గిరి వీధుల్లో గడప గడపకూ వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. అనంతరం లబ్ధిదారులకు సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేశారు. విష్ణు మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో డివిజన్ పూర్తిగా కళ తప్పిందన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. 14వ ఆర్థిక సంఘం నిధులు రూ. 80 లక్షలతో తాడంకివారి వీధి, పాపరాజువారి వీధి, ఓగిరాలవారి వీధి, తిరుమలశెట్టి వీధి, కొమ్మువారి వీధి, కనకరాజు వీధుల్లో కొత్తగా రోడ్లను నిర్మించినట్లు వెల్లడించారు. వీఎంసీ సాధారణ నిధులు రూ. 16.20 లక్షలతో కావూరివారి వీధి, మైలవరపు జమీందార్ వీధుల్లో పాత రోడ్లకు మోక్షం కలిగిందని పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా విడుదలైన రూ. 80 లక్షల నిధులతో వందనపువారి వీధి, ముదిగొండవారి వీధి, తిరుమలరాజు వీధి, దాక్షాయణం వారి వీధి, రామ మందిరం వీధుల్లో నూతన రహదారుల నిర్మాణానికి టెండర్లను ఆహ్వానించామని తెలిపారు. రూ. 80 లక్షల వ్యయ అంచనాతో చేస్తున్న యూజీడీ సంపు వచ్చే నెల మొదటి వారానికి పూర్తిగా వినియోగంలోకి వస్తుందని మల్లాది విష్ణు తెలిపారు. రూ. 2.56 కోట్ల నిధులతో ఏకేటీపీ ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన నాడు–నేడు పనులు శరవేగంగా జరుగుతున్నట్లు వెల్లడించారు. అయోధ్యనగర్ యూహెచ్‌సీలో రోగులకు మెరుగైన వైద్య సేవలను అందిస్తుందని తెలిపారు.

90 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధికి ఈ ప్రభుత్వంలోనే రూ. 70 లక్షల కామన్ గుడ్ ఫండ్ (సీజీఎఫ్) నిధులు విడుదలైనట్లు మల్లాది విష్ణు గుర్తుచేశారు. మరోవైపు విభజిత ఆంధ్రప్రదేశ్‌కు ఏ ఒక్క హామీ అమలు చేయని బీజేపీ పెద్దలు.. రాష్ట్ర ప్రభుత్వంపై నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారని మల్లాది విష్ణు మండిపడ్డారు. కర్ణాటకలో జరిగిన ఎన్నికల ఓటమితో జేపీ నడ్డా, అమిత్‌షాలకు మతిభ్రమించిందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో డీఈ గురునాథం, ఏఎంఓహెచ్ రామకోటేశ్వరరావు, సీడీఓ జగదీశ్వరి, డివిజన్ కోఆర్డినేటర్ దోనేపూడి శ్రీనివాస్, నాయకులు లంకా బాబు, చల్లా సుధాకర్, కొల్లూరు రామకృష్ణ, మైలవరపు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



33వ డివిజన్‌లో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, కార్పొరేటర్ మూర్తి

రాష్ట్రానికే తలమానికంగా అంబేడ్కర్ విగ్రహం

వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

భవానీపురం(విజయవాడపశ్చిమ): అంబేడ్కర్ స్మృతివనం ప్రాజెక్ట్ పనులను ఒక మహాయజ్ఞంలా చేస్తున్నారని, 125 అడుగుల ఎత్తైన అంబేడ్కర్ విగ్రహం నిర్మాణం పూర్తి చేసుకుని రాష్ట్రానికే తలమానికంగా నిలవనుందని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు స్పెషల్ చీఫ్ సెక్రటరి వై.శ్రీలక్ష్మి పర్యవేక్షణలో ఎంజీ రోడ్డులోని స్వరాజ్యమైదానంలో జరుగుతున్న అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ పనులను ఆయన అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 18.18 ఎకరాల్లో అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ పనులు అత్యంత వేగంగా జరుగుతున్నాయని, ఇప్పటికే 74 అడుగుల ఎత్తు (ఉదర భాగం) వరకు విగ్రహ నిర్మాణం పూర్తయ్యిందని తెలిపారు. అంబేడ్కర్ స్మృతివనం పనుల కోసం వందలాది మంది కార్మికులు భారీ యంత్రాలతో రాత్రింబవళ్లు పనులను కొనసాగిస్తున్నారని చెప్పారు.

సీఎం జగన్ దిశానిర్దేశంతో పనులు వేగవంతం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా అంబేడ్కర్ స్మృతివనం ప్రాజెక్ట్‌పై దృష్టి సారించి పనులను సమీక్షిస్తూ అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నారని కమిషనర్ అన్నారు. ఢిల్లీ నుంచి వచ్చిన స్మృతివనం నిర్మాణం డిజైన్ల ఆధారంగా పొరపాట్లకు తావులేకుండా నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనుల్లో వేగం పెంచారని తెలిపారు. సీలింగ్, ప్లాస్టింగ్ పనుల్లో జాప్యం లేకుండా చేస్తున్నారని, క్వాలిటీ కంట్రోల్ అధికారులు నాణ్యతా ప్రమాణాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారని తెలిపారు. గ్రానైట్, ఫుట్‌పాత్, ల్యాండ్‌స్కేప్, కాంపౌండ్‌వాల్ నిర్మాణం తుది దశకు చేరుకుంటున్నాయని, పార్కింగ్ ఏరియాకూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ ప్రాంగణంలో అందమైన రకరకాల పూలు, ఆకర్షణీయమైన మొక్కలతో గ్రీనరీ ఏర్పాటు చేయనున్నారని తెలిపారు.



అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

వైభవంగా ధ్వజస్తంభ పునఃప్రతిష్ట

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం పెరికీడులోని పంచాయతన క్షేత్రమైన ముక్తికాంత సమేత ముక్తేశ్వర స్వామి దేవస్థానంలో నూతన ధ్వజస్తంభ పునఃప్రతిష్టా మహోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. ఆగమశాస్త్ర ప్రకారం నూతన ధ్వజస్తంభం పునఃప్రతిష్ట చేపట్టేందుకు బ్రహ్మశ్రీ యలమంచిలి కృష్ణమూర్తి శివాచార్య, యలమంచిలి ప్రసాదశర్మ, కుందుర్తి సీతారామయ్య సారథ్యంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. వేద మంత్రోచ్చరణలతో ఉదయం 7.29 గంటలకు ధ్వజస్తంభ యంత్ర ప్రతిష్ట చేశారు. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తుల శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. క్రేన్ సాయంతో ఏకశిల ధ్వజస్తంభాన్ని ప్రతిష్టించారు. అనంతర శాంతి కల్యాణం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో సుమారు 5 వేల మందికి అన్న సమారాధన నిర్వహించారు. ఎంపీపీ యర్రగొర్ల నగేష్, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఆవిర్నేని శేషగిరిరావు, కానుమోలు పీఏసీఎస్ చైర్మన్ చిన్నాల సత్యగణేష్ బాబు, హనుమాన్‌జంక్షన్ ఎస్ఐ ఏడీఎల్ జనార్దన్, బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ బొడ్డేపల్లి నరేష్‌కుమార్, ఆలయ కమిటీ సభ్యుడు, మాజీ సర్పంచ్ తవ్వా హేమేశ్వర నరసింహామూర్తి పాల్గొన్నారు.

వెండితెర అరుణకిరణం టి.కృష్ణ



విజయవాడ కల్చరల్: వెండితెర అరుణకిరణం దర్శకుడు టి.కృష్ణ అని ఆయన దర్శకత్వం వహించిన చిత్రాలు ప్రజా సమస్యలకు అద్దం పట్టేవని టి.కృష్ణ సాంస్కృతిక కళాపీఠం వ్యవస్థాపకుడు మారపాక రాంబాబు అన్నారు. టి.కృష్ణ సాంస్కృతిక కళాపీఠం ఆధ్వర్యాన గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో సోమవారం టి.కృష్ణ కుమారుడు, సినీ నటుడు గోపీచంద్ జన్మదిన వేడుకలు, సినీ సంగీత విభావరి కార్యక్రమాన్ని నిర్వహించారు. రాంబాబు మాట్లాడుతూ టి.కృష్ణ ఎంతోమందిని తెలుగు సినిమాలకు పరిచయం చేశాడన్నారు. సినీ నటుడు గోపీచంద్ కూడా విజయవంతమైన సినిమాల్లో నటించినట్లు తెలిపారు. సావిత్రి కళాపీఠం వ్యవస్థాపకురాలు పరచూరి విజయలక్ష్మి మాట్లాడుతూ సాంస్కృతిక సేవా సంస్థలు ప్రజాసేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు. సభ్యుడు సోమిశెట్టి సురేష్ సంస్థ లక్ష్యాలను వివరించారు. వివిధ సినీ నటుల అభిమాన సంఘాల ప్రతినిధులు ఏస్ శేఖర్, కేశవ చౌదరి, పోతిన వెంకటేష్, నున్న శివనాగేశ్వరరావు పాల్గొన్నారు. స్వరాంజలి కార్యక్రమంలో దండుచంద్రశేఖర్, ఒమ్మి రామ శంకర్, డాక్టర్ అమలారాణి, కృష్ణకుమారి, సువర్ణ లక్ష్మి పలు చిత్రగీతాలను ఆలపించారు. గాయనీ గాయకులను నిర్వాహకులు సత్కరించారు.

రేషన్ పంపిణీలో అలసత్వం వద్దు



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటికీ రేషన్ పంపిణీలో అలసత్వం వహిస్తే సహించబోమని స్థానిక 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణిమూర్తి రేషన్ డీలర్లను హెచ్చరించారు. 33వ డివిజన్‌లో జరుగుతున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో రేషన్ పంపిణీ అంశంపై కార్డుదారుల నుంచి ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆదేశాల మేరకు సోమవారం సత్యనారాయణపురం 215 సచివాలయంలో రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డోర్ డెలివరీ నిమిత్తం ప్రభుత్వం ఏర్పాటు చేసిన రేషన్ వాహనాలు చాలా చోట్ల ఇంటింటికీ వెళ్లడం లేదని వస్తున్న ఫిర్యాదుల గురించి మాట్లాడారు. ప్రతి వాహనం వీధి చివరన కాకుండా ప్రతి ఇంటి వద్ద ఆపి రేషన్ సరుకులు ఇవ్వాలని ఆదేశించారు. రేషన్ డీలర్లు ప్రభుత్వం ఇస్తున్న సరుకులను సక్రమంగా గోడౌన్ నుంచి డ్రా చేసిన వాటిని ఎండీయూ ఆపరేటర్లకు అందజేయాలని చెప్పారు. కొన్నిచోట్ల దురుసుగా వ్యవహరిస్తున్నట్లు ఆపరేటర్ల మీద ఫిర్యాదులు వస్తున్నాయని పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు. తీరు మార్చుకోకపోతే చట్ట ప్రకారం తొలగిస్తారని చెప్పారు. సమావేశంలో 209, 210, 212, 318 నెంబర్ల రేషన్ డీలర్లు శ్రీనివాసరావు, దుర్గాంబ, ప్రసాద్, చైతన్య, ఎండీయూ ఆపరేటర్లు, వీఆర్వో లలిత, శివప్రసాద్, జె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సైక్లింగ్‌తో శారీరక ఆరోగ్యం

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): ప్రతి రోజూ సైకిల్ వినియోగించడం ద్వారా శారీరక ఆరోగ్యం కలుగుతుందని గుంటుపల్లి కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ పీవీఎస్ఆర్ కృష్ణ అన్నారు. కేంద్ర విద్యా విధానం 2020పై నిర్వహిస్తున్న స్థానిక కేంద్రీయ విద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జన్భాగీదారీ పక్షోత్సవాల్లో భాగంగా సోమవారం సైకిల్ ర్యాలీ నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.

పండ్లు, మజ్జిగ పంపిణీ



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సీపీఐ 58వ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో పాదచారులు, ప్రయాణికులకు సింగ్‌నగర్ ఫ్లైఓవర్ రోడ్డులో సోమవారం మజ్జిగ, పండ్లు పంపిణీ చేశారు. సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, కార్యదర్శివర్గ సభ్యులు కేవీభాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.